క్లుప్తంగా

వైద్య సిబ్బందికి సన్మానం



వైద్య సిబ్బందిని సన్మానించిన నాసిన్ ఉద్యోగులు

పెనుకొండ: పెనుకొండ వైద్య సిబ్బందిని గురువారం నాసిన్ ఉద్యోగులు సన్మానించారు. వివరాల్లోకెళితే.. గత శనివారం నాసిన్‌లో పనిచేసే జేడీ అనిత (50) తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో స్పృహతప్పి పడిపోయారు. దీంతో సిబ్బంది హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య సిబ్బంది గుండెనొప్పిగా తేల్చి చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. ఈ నేపథ్యంలో ఆమె ప్రాణాలు కాపాడినందుకు డాక్టర్ మోహన్‌నాయక్‌తో పాటు వైద్యాధికారి భానునాగశ్రీనర్సింగ్ సిబ్బంది రుక్మిణి, రాధలను నాసిన్‌కు పిలిపించుకుని సన్మానించారు. నాసిన్ డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



గోళ్లాపురంలో సతీష్‌కుమార్ వర్ధంతిలో పాల్గొన్న పార్టీ నాయకులు

హిందూపురం: మండలంలోని గొళ్లాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సతీష్ ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు సతీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సతీష్ జ్ఞాపకార్థంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సతీష్ పార్టీలో చురుగ్గా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. సతీష్ దూరం కావడం పార్టీకే కాకుండా కుటుంబ సభ్యులకి తీరనిలోటని అన్నారు. సర్పంచ్ దేవరాజ్, నాయకులు తిప్పేరుద్రయ్య, ఉప సర్పంచ్ శివకుమార్, రంగనాథ్, శ్రీనివాసులు, గోపాల్, బాలప్ప శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేష్‌కృష్ణ

పెనుకొండ రూరల్: పెనుకొండ డివిజన్‌లోని 7 మండలాలకు చెందిన మహిళా సర్పంచులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. మహిళా సాధికారిత, స్థానిక స్వపరిపాలన, గ్రామీణ అభివృద్ధి, పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గోరంట్ల: మండల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమంగా మద్యం బాటిళ్లను సీఐ బోయ శేఖర్ ఆధ్వర్యంలో పులేరు సమీపంలో సిక్స్‌లైన్ రోడ్డుపై బుధవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారుల సమక్షంలో 78 ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 2184.27 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు.

చేస్తున్న మంచిని వివరించండి



మాట్లాడుతున్న మంత్రి సవిత


పెనుకొండ: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని పెనుకొండ మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లో ప్రారంభించాలని మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రికి చెందిన అన్నా క్యాంటీన్‌లో జరిగిన సమావేశంలో ఆమె పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

రొళ్ల: మండల పరిధిలోని రంగసపల్లి చింతతోపులో 33/11కేవీఏ సామర్థ్యమున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు గురువారం ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్ తెలిపారు. మడకశిర విద్యుత్‌శాఖ ఏడీఈతో కలిసి భూమిని సర్వే చేసి, రైతుల నుంచి వ్యతిరేకత ఏమైనా ఉందా? అని ఆరా తీశామన్నారు. ఈనెల 7న సబ్‌స్టేషన్ నిర్మాణానికి పనులు ప్రారంభిస్తామన్నారు.

ప్రైవేటు కళాశాలలే దిక్కు !

- బాలుర కళాశాలలకు నోచుకోని 'పురం'
- ఇంటర్, డిగ్రీ చదువులకు దూరమవుతున్న విద్యార్థులు
- హామీలను అటకెక్కించిన ఎమ్మెల్యే బాలకృష్ణ
- రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రుల అవస్థలు



హిందూపురం టౌన్: జిల్లాలో అతిపెద్ద పట్టణం హిందూపురం. రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిన నియోజకవర్గం కూడా ఇదే. అయితే పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది హిందూపురం పరిస్థితి. జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరొందినా ఇప్పటి వరకు ఇక్కడ బాలురకు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

హామీలకే పరిమితమైన బాలయ్య ..

తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలు టీడీపీ ఆదరిస్తున్నా వారు మాత్రం ఇక్కడి ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నారు. ప్రస్తుతం హిందూపురం నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ శాసన సభ్యులుగా ఉన్నారు. బాలకృష్ణ ఎన్నికల వాగ్దానాల్లోనూ హిందూపురంలో ప్రభుత్వ బాలుర జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీని నిలుపుకోలేకపోయారు. పట్టణంలో బాలురకు ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రతి యేటా ఎంతో మంది పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. వేలకు వేలు డోనేషన్లు చెల్లించి ప్రైవేటు కళాశాలలో చేర్పడానికి ఆర్థిక స్తోమత లేక ఈ ప్రాంత విద్యార్థులు కళాశాల విద్యకు దూరమవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో విద్యార్థులను ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రైవేటు కళాశాలలదే హవా..

హిందూపురం పట్టణంలో మొత్తం 14 వరకూ ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపుగా 15 వేల మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 1200 నుంచి 1300 మంది దాకా విద్యార్థినులు చదువుతున్నారు. అయితే బాలురకు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నాయి. దీంతో చాలా మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. కొంత మంది పేద విద్యార్థులు ఇంటర్ వరకు నెట్టుకొస్తూ, ఆర్థిక భారంతో డిగ్రీ చదువుకు దూరమవుతుంటే, కొందరు మాత్రం 10వ తరగతితోనే విద్యను ముగిస్తున్నారు.

మరోసారి విద్యార్థులకు నిరాశ

పట్టణంలోని శ్రీకంఠపురంలోని ఖాళీగా ఉన్న మున్సిపల్ పాఠశాల భవనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ముద్దిరెడ్డిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవనాల్లో జూనియర్ కళాశాలలను 2018 సంవత్సరంలో తాత్కాలికంగా ప్రారంభించారు. అయితే కళాశాలలకు పోస్టులు మంజూరు చేయకపోవడంతో పూర్తిస్థాయిలో అధ్యాపకుల నియామకం జరగలేదు. దీంతో చేరడానికి వచ్చిన కొందరు విద్యార్థులు సైతం కళాశాలల్లో చేరడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆ కళాశాలలు మూతబడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు, ప్రారంభంపై ఎలాంటి ఊసైనా లేకపోవడంతో విద్యార్థులకు మరోసారి నిరాశే ఎదురవుతోంది. దీంతో ప్రైవేటు కళాశాలల బాట పట్టక తప్పని పరిస్థితి.

విద్యను ఆపేయాల్సిన దుస్థితి



హిందూపురం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలో రూ.వేలు చెల్లించి ఇంటర్ విద్యను పూర్తి చేశాను. ఇప్పుడు డిగ్రీ చదవాలనుకున్నా.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రైవేటు కళాశాలకు వెళ్లకతప్పడం లేదు. అయితే చాలా మంది పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో అర్ధాంతరంగానే విద్యను ఆపేయాల్సిన దుస్థితి ఉంది. వెంటనే ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలకు ఏర్పాటు చేస్తే నాలాంటి విద్యార్థులకు ఉపయోగపడతాయి.

– కలీమ్, విద్యార్థి,హిందూపురం

కళాశాలలను ఏర్పాటు చేయాలి



దశాబ్దాల కాలం నుంచి హిందూపురంలో బాలురకు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు లేకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పట్టణంలో బాలికలకు జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అయితే బాలురకు మాత్రం నేటికీ కళాశాలను ఏర్పాటు చేయలేదు. హిందూపురం వ్యాప్తంగా సామాన్య, పేద, రైతు కుటుంబాలు వారి పిల్లలను ప్రైవేటు కళాశాలలకు చేర్చాలంటే ఫీజులకు భయపడి పిల్లలను కళాశాలల్లో చేర్చకుండా పనులకు పంపుతున్నారు. ఇక్కడ కళాశాలలు ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నరసింహమూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు



వైఎస్సార్ విగ్రహం వద్ద పనులను పర్యవేక్షిస్తున్న వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈనెల 8న ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పరిగిబబస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఉన్న గ్రిల్స్‌కు మరమ్మతు చేయించి నూతనంగా పెయింట్ వేయిస్తున్నారు. పనులను గురువారం వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, నాయకులు పనులను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చౌడప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్త రవిచంద్ర తండ్రి చౌడప్ప (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కుంటిగ వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్ తదితరులు గ్రామానికి వెళ్లి చౌడప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రైవేటు పాఠశాలల బంద్ విజయవంతం

అమరాపురం: రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోషియేషన్ పిలుపు మేరకు మండలంలో ప్రైవేటు పాఠశాలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల పట్ల వివక్ష చూపుతోందని కరస్పాండెట్లు, పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం ప్రైవేటు పాఠశాలలు బంద్ నిర్వహించాయి. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

జనసేన, బీజేపీని విస్మరించిన టీడీపీ



తిమ్మలాపురంలో జనసేన, బీజేపీ నాయకులు లేకుండా ఇంటింటికీ తిరుగుతున్న టీడీపీ నాయకులు

గుడిబండ: కూటమి నాయకుల పొత్తు రాష్ట్రస్థాయిలోనే కాని గ్రామస్థాయిలో లేదని టీడీపీ నాయకులు నిరూపించారు. గురువారం మండల పరిధిలోని తిమ్మలాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ఇందులో జనసేన, బీజేపీ నాయకులను టీడీపీ నాయకులు ఆహ్వానించలేదు. దీంతో కేవలం గ్రామ స్థాయి టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలను కర పత్రాలను పంపిణీ చేశారు. మరోపక్క జనసేన, బీజేపీ నాయకులు టీడీపీ నాయకుల పనితీరును చూసి రగిలిపోతున్నారు. ప్రతి కార్యక్రమానికి తమను ఆహ్వానించ కూడా కేవలం టీడీపీ నాయకులు మాత్రమే జరుపుకుంటున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

హిందూపురం టౌన్: అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీను నిర్వహించారు. పట్టణంలోని చిన్న మార్కెట్ నుంచి గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ యువత డ్రగ్స్ తీసుకోవడం వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటారని, జీవితాలు అంధకారంగా మారుతాయన్నారు. యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు, ఎక్సైజ్ సీఐ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు అన్యాయం



వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చిస్తున్న ఈరలక్కప్ప

మడకశిర: కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష గట్టిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని విమర్శించారు. ఆయన గురువారం పట్టణంలో సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదు చేస్తున్న అక్రమ కేసులపై పార్టీ నాయకులతో సమావేశమై చర్చించారు. ఆయన మట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేయించి రాక్షసానందాన్ని పొందుతోందన్నారు. గుండుమలకు చెందిన దళిత మంజునాథ్‌పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారన్నారు. అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌పై కూడా పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి గొంతులు నొక్కడం హేయమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడవద్దని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కార్యకర్తలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, నాయకులు మంజునాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. గురువారం ఆయన ఛత్రం గ్రామంలో వివిధ కమిటీ సభ్యులు, నాయకులతో కలిసి పార్టీ బలోపేతం, ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షులు రంగేగౌడ్, సర్పంచ్ చిన్నయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు మల్లికార్జున, సుధాకర్, నరసింహా, సికిందర్ పట్టణ ఉపాధ్యక్షులు మధు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

పావగడ: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలు పరిశుభ్రతను పాటించి పరిసరాలను పరిరక్షించి ఆరోగ్యవంతమైన జీవితాలను గడపాలని మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్ ప్రజలకు సూచించారు. గుడ్ మార్నింగ్ పావగడ పేరుతో పట్టణంలోని 23వ వార్డు కన్మాస్ చెరువు ప్రాంతంలో ఆయన గురువారం ఉదయం పర్యటించారు.

బదిలీల్లో దివ్యాంగులకు అన్యాయం

హిందూపురం: గ్రామ వార్డు సచివాలయ బదిలీల్లో దివ్యాంగ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జీఓ నంబర్ 5, 6 అనుసరించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం బదిలీల్లో ఉన్నతాధికారులు నిబంధనలు పాటించలేదన్నారు. దివ్యాంగులను సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం చాలా అన్యాయమన్నారు. దివ్యాంగ ఉద్యోగుల బదిలీల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా సంఘం తరఫున పోరాటం చేస్తామన్నారు.

నేత్రదానం



రాఘవులు నేత్రాలను అందిస్తున్న కుటుంబ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని బీటీ కాంపౌండ్‌లో నివసించే శ్రీనివాసులు తండ్రి రాఘవులు మరణించారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. కె.ఏ.శ్రీనివాసమూర్తి ఫౌండేషన్ సభ్యులు కేఎస్ జయంతి, డాక్టర్ సంధ్య లక్ష్మి తరలివచ్చి రాఘవులు నేత్రాలను సేకరించి బెంగళూరు నారాయణ నేత్రాలయ ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధి కాలువపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఎంపీడీఓ రెడ్డెప్ప, ఏపీఓ అప్పిస్వామినాయుడు గురువారం పరిశీలించారు. రైతు సిద్ధలింగప్పకు చెందిన పొలంలో వర్షాధార పండ్ల తోటల పెంపకం ద్వారా చేపడుతున్న మామిడి చెట్ల గుంతల తవ్వకాలను పరిశీలించారు.

ఏం చేశారని ఇంటింటికీ తిరుగుతున్నారు?

రొళ్ల: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఏం సుపరిపాలన అందించారని 'సుపరిపాలన తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి తదితర పథకాలు ఏమయ్యాయో చెప్పాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై 8న అవగాహన

రొళ్ల: మడకశిర స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ పరిధిలో ఈనెల 8, 10తేదీల్లో బాల్య వివాహాల నిర్మూలన, బాలికల భద్రత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. ఈనెల 8వ తేదిన అగళి మండల కేంద్రం, 10వ తేదిన రొళ్ల మండల కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రితో కార్యక్రమం పై చర్చించామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కియా ఎస్ఐ రాజేష్ వివరాలమేరకు.. మండలంలోని మక్కాజిపల్లి తండాకు చెందిన విజయమ్మ బాయి (42) కియా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేది. మంగళవారం ఉదయం మొదటి షిఫ్ట్ డ్యూటీకి వెళ్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై కియా మెయిన్ గేట్ సమీపంలోకి రాగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపు తప్పి పడిపోయింది. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

గణితం, ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులో పట్టు సాధించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. విద్యాశక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం మధ్యాహ్నం ఆవినకుంట కేజీబీవీ, రొళ్ల, అలుపనపల్లి, రత్నగిరి ఉన్నత పాఠశాలల్లో గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులపై 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

విశ్రాంత తహసీల్దార్‌కు సన్మానం

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం రిటైర్డ్ తహసీల్దార్ కరుణాకర్ దంపతులను సన్మానించారు. కరుణాకర్ గత నెల 30న మడకశిర తహసీల్దార్‌గా పని చేస్తు పదవి విరమణ పొందారు. దీంతో స్థానిక తహసీల్దార్ షేక్షావలి రిటైర్డ్ తహసీల్దార్ కరుణాకర్ దంపతులను ఆహ్వానించి సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు.

మహాలక్ష్మిగా సప్తమాతృక అమ్మవారు



పరిగి: మండల కేంద్రంలోని సప్తమాతృక ఆలయంలో ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

కంటి చికిత్స కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి బాధితులకు నిరంతర కంటి పరీక్షలు, కంటి చికిత్స సేవలు అందించడానికి ఆశా కిరణ దృష్టి కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాలూకా వైద్యాధికారి ఏఎస్ఎల్ బాబు మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా కంటి బాధితులకు ఉచితంగా కంటి జబ్బుల నివారణ సేవలకు నిరంతరం అందు బాటులో ఉండేలా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే తొలి సారిగా ఆశా కిరణ దృష్టి కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు.

టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి

హిందూపురం: టీబీ వ్యాధి నిర్మూలనపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ గౌస్ పీర్ అన్నారు. గొల్లాపురం గ్రామంలో టీబీ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. టీబీ నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు, తదతరులు పాల్గొన్నారు.

పేరుకే ప్రభుత్వాస్పత్రి !

- అగళి పీహెచ్‌సీలో ఇష్టారాజ్యంగా వైద్య సిబ్బంది విధులు
- ఇబ్బందుల్లో రోగులు



వైద్య సిబ్బంది లేక ఖాళీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రక్త పరీక్ష కేంద్రనికి తాళం వేసిన దృశ్యం

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుకు మాత్రమే 24 గంటల ఆస్పత్రిగా మారింది. ఉన్న అరకొర వైద్య సిబ్బంది విధులకు డుమ్మా కొడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసార వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న తరుణంలో వైద్య సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం సరికాదని ప్రజలు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కేవలం ఆశా కార్యకర్తలతో సర్వేలు చేయిస్తున్నారని వైద్య సిబ్బంది పత్తాలేకుండా పోతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం జిల్లా సరిహద్దులో ఉండటంతో అడిగే వారు కూడా లేరని వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం ఎంఎం పాళ్యం గ్రామానికి చెందిన రోగులు వైద్యం కోసం వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వెళితే రక్త పరీక్ష చేయించుకునేందుకు, సూదులు వేయించుకోవడానికి వస్తే వైద్య సిబ్బంది లేరని, కేవలం మందులు ఇచ్చే సిబ్బంది మాత్రమే ఉన్నారని రోగులు తెలిపారు. రోగుల వెంట వచ్చిన వారు వైద్య సిబ్బంది లేరన్న విషయాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది.